పల్లె చెంతనే.. ఆధునిక వైద్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్యశాలల రూపు రేఖలే మారిపోయాయి. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ పీహెచ్‌సీల్లో కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు తీసుకుంది. ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సంఖ్య క్రమేణా పెరిగింది. రోగులకు అవసరమైన మందులు సిద్ధంగా ఉన్నాయి. ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత తీర్చడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

- నాడు- నేడుతో వైద్యశాలల ఆధునికీకరణ
- పీహెచ్‌సీల్లో అందుతున్న మెరుగైన వైద్యం
- పెరిగిన ఓపీ
- అందుబాటులో 160 రకాల మందులు



నాడు-నేడు నిధులతో నూతన హంగులతో గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వరికుంటపాడు: ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అందులో 154 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఒక్కొక్క పీహెచ్‌సీకి రోజుకు 50 నుంచి 100 మంది వరకు వైద్యసేవల కోసం వస్తున్నారు. గతంలో మాదిరి రోగులు మెరుగైన వైద్యం, పరీక్షల కోసం దూర ప్రాంతాలైన కావలి, నెల్లూరు, ఒంగోలు, చెన్నై తదితర వెళ్లకుండానే స్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రంలోనే పొందే విధంగా ప్రభుత్వం వసతులు కల్పించింది. వైద్యశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చడంతో పాటు, తగినంత మంది వైద్య సిబ్బందిని నియమించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించి మారుమూల పల్లెల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు రూ.లక్షల విలువ చేసే పరికరాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. గతంలో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాలంటే బయపడే రోగులు జగనన్న ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి మెరుగైన వైద్యసేవలు అందిస్తుండడంతో ధైర్యంగా వైద్య సేవల కోసం ఆరోగ్య కేంద్రాలకు క్యూ కడుతున్నారు. దీంతో ఓపీ సంఖ్య కూడా రెట్టింపైంది.

భవనాల ఆధునికీకరణ

ఆరోగ్య కేంద్రంలో నాడు-నేడు పథకం ద్వారా లక్షల రూపాయల విలువ చేసే పనులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయగిరి మండలంలోని గండిపాళెం ఆరోగ్య కేంద్రంకు నాడు-నేడు నిధులు రూ.34 లక్షలు, వరికుంటపాడుకు రూ.24 లక్షలు మంజూరై పనులు కూడా పూర్తయి, వైద్యశాలలో సేవలు అందుతున్నాయి. గండిపాళెం, వరికుంటపాడు పీహెచ్‌సీలో రోజువారి రోగుల సంఖ్య 80కి పెరిగింది.

అందుబాటులో 160 రకాల మందులు

ప్రతి పీహెచ్‌సీలో కుక్కకాటు, పాము, తేలుకాటు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ తదితర వ్యాధులకు సంబంధించిన 160 రకాల మందులు అందుబాటులో ఉంచారు. ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసి, రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు ప్రోత్సహిస్తున్నారు.


ప్రభుత్వం అందజేసిన ఆధునిక వ్యాధి నిర్ధారణ పరికరం

ఐపీహెచ్ స్టాండర్డ్స్ ప్రకారం సిబ్బంది కేటాయింపు

గత ప్రభుత్వ పాలనలో ఒక్కో పీహెచ్‌సీలో ఒక్కో విధంగా సిబ్బంది ఉండేవారు. ఒక చోట ఐదుగురుంటే మరో చోట 15-20 మంది వరకు ఉండేవారు. ఫలితంగా వైద్య సేవలు అరకొరగా అందుతుండేవి. అత్యవసర సమయాల్లో రోగులు ఇబ్బందులు పడేవారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం ప్రస్తుతం ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది విధులు నిర్వహించేలా పటిష్ఠ చర్యలు తీసుకుంది. ఫలితంగా రోగులకు మెరుగైన సేవలందుతున్నాయి.

అన్ని వేళల్లో అందుబాటులో సిబ్బంది



గండిపాళెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది 24 గంటలు ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో రాత్రి వేళలో వైద్యసేవలు అందేవి కావు. ప్రస్తుతం డ్యూటీ డాక్టర్, నర్సు అందుబాటులో ఉంటున్నారు. జగనన్న వైద్యశాలల రూపురేఖలే మార్చేశారు. ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం కుదిరింది.

– షేక్ బాషా, గండిపాళెం

మెరుగైన సేవలు అందిస్తున్నారు



మాది గండిపాళెం.. ఇటీవల అనారోగ్యంగా ఉండడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చాను. అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండి.. నర్సులు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చకా చకా చేశారు. డాక్టర్ పరీక్షించిన అనంతర మందులు రాసిచ్చారు. గతంలో కన్నా ఇప్పుడు వైద్య సేవలు మెరుగ్గా వున్నాయి.

– షేక్ జానీబాషా, గండిపాళెం

పీహెచ్‌సీలోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు



గ్రామీణ ప్రాంతాల్లోని రోగులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు గతంలో మాదిరిగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేదు. ఇక్కడే ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 160 రకాల మందులు అందుబాటులో ఉన్నా యి. సిబ్బంది తగినంత మంది ఉన్నారు. ఓపీ పెరిగింది. కాన్పులు కూడా చేస్తున్నాం. ఎస్‌బీఐ బ్యాంకు రూ.5 లక్షల విలువ చేసే లేబర్‌రూం పరికరాలు అందించింది. మలేరియా, డెంగీ పరీక్షలు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ ఎం.శివకల్పన, గండిపాళెం, ఉదయగిరి మండలం

క్లుప్తంగా

15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించాలి

ఉదయగిరి: మండలంలోని 17 పంచాయతీలకు రెండో విడత మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్యతా క్రమంలో వినియోగించాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ సూచించారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 17 పంచాయతీలకు రూ.86,21,823 మంజూరయ్యాయన్నారు. ప్రధానంగా తాగునీరు సరఫరా సిబ్బంది, క్లాప్‌మిత్ర వేతనాలు, వీధి దీపాల మరమ్మతులు, పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపులు, పారిశుధ్యం పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేసిన వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఓ రేణుక, ఈఓపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన బాలాజీ నాయక్

ఆత్మకూరురూరల్: సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆత్మకూరు నూతన ఎంపీడీఓగా బి బాలాజీనాయక్ సోమవారం స్థానిక బాధ్యతలు స్వీకరించారు. చంద్రగిరి ఎంపీడీఓగా పనిచేస్తూ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు.

ఓపీఎస్ పునరుద్ధరించండి


ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ఉద్యోగుల ఆవేదన అర్థం చేసుకోవాలని యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు కోరారు. యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాద్‌రావు, ఆత్మకూరు కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు, ఖాదర్‌బాషా, ఈశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, ఏఎస్‌పేట మండలాల యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది

మర్రిపాడు: మర్రిపాడు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.మనోహర్‌రాజును సోమవారం వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బుజ్జమ్మ సీసీలు, సిబ్బందితో కలిసి సన్మానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు సమష్టి సహకారం అందిస్తామన్నారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా కరిముల్లా

ఉదయగిరి: ఉదయగిరి మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా శకునాలపల్లి పంచాయతీ కార్యదర్శి షేక్ కరిముల్లాను నియమించినట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి పంచాయతీ ఈఓగా పని చేస్తున్న నర్సయ్య వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కరిముల్లాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు.

నేడు కేశవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

జలదంకి: మండలంలోని కేశవరం పంచాయతీ తిమ్మసముద్రం సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రాజశేఖరరావు సోమవారం తెలిపారు. ప్రత్యేక వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తూర్పుయర్రబల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

కొండాపురం: మండలంలోని తూర్పుయర్రబల్లిలో అంతర్గత సిమెంట్ రోడ్లకు సర్పంచ్ బండారు ఏసమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో చెరువు కొలను పనులను పూర్తి చేశామన్నారు. వీధిలైట్లు, పారిశుధ్యం, అంతర్గత రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉండేల నాగిరెడ్డి, చినబోయిన నరేష్, బండారు చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి, మురళి, పుల్లయ్య పాల్గొన్నారు.


ప్రతిభకు ప్రోత్సాహక నగదు బహుమతులు


విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు రానున్న పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయనున్నట్లు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ప్రకటించారు. స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని అన్నప్రసాద భవనంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.20 వేలు ప్రథమ బహుమతిగా, రూ.15 వేలు ద్వితీయ బహుమతిగా, రూ.10 వేలు తృతీయ బహుమతిగా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో 500 పైబడి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ.7,500, రూ.5,000 అందజేస్తామని ఆయన వెల్లడించారు. అపస్ ఉపాధ్యాయులు కంచి పరమేశ్వరరెడ్డిని సన్మానించారు. ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ యానాదిరెడ్డి, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వండి

- ఆర్డీఓ కె మధులత


స్పందనలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: ప్రజలు ఎంతో నమ్మకంతో స్పందన కార్యక్రమానికి వచ్చి ఇచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధ్యతగా పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్డీఓ కురుబ మధులత చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌పేట, మర్రిపాడు, అనంతసాగరం మండలాల నుంచి పలువురు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించిన ఆమె తహసీల్దార్లతో ఫోన్‌లో మాట్లాడారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా మండల స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో అందజేసిన అర్జీలను అధిక ప్రాధాన్యత ఇస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యాలయ ఏఓతో పాటు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఆర్‌ఐ ఖాసీం, ఎన్నికల డీటీ సుప్రభ, డీటీ సంధ్య, సీడీపీఓ సునీలత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు


వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న దృశ్యం

ఉదయగిరి: నియోజకవర్గంలోని 8 మండలాల్లో జగనన్న లేఅవుట్లకు సంబంధించి లబ్ధిదారులకు వేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం సెలవు రోజైనప్పటికీ గ్రామ సచివాలయాలు లబ్ధిదారులతో కిటకిటలాడాయి. సోమవారం కూడా గ్రామ సచివాలయాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తలపించాయి. రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఉదయగిరి నియోజకవర్గంలో 9 వేల మందికి పైగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి: ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మోదీ పాలనలో చమురు, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. నల్లచట్టాలు రద్దు చేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం ఇంత వరకు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, నాయకులు వెంకటయ్య, జి.మల్లికార్జున, ఫర్దిన్‌బాషా, వెంకటేశ్వర్లు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. డాక్టర్

- వేళకాని వేళలో వైద్య సేవలు

మర్రిపాడు: వేళ కాని వేళలో సైతం తన వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో వ్యవహరించి, విధులు నిర్వర్తించిన ఆ డాక్టర్ పలువురి ప్రశంసలు అందుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చిలకపాడు గ్రామానికి చెందిన కొందరు వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పింది. ఆటోలోని 8 మంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మర్రిపాడు పీహెచ్‌సీకి తరలించారు. స్థానికుల సమాచారంతో వెంటనే పీహెచ్‌సీకి చేరుకున్న డాక్టర్ గోపినాథ్ గాయపడిన వారందరికి వైద్య సేవలందించారు. ఆ రాత్రి వేళ వైద్య సేవలు అందించిన డాక్టర్ గోపినాథ్‌కు బాధితులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు


వాహన చోదకులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కావలి: జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా కావలిలోని సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు సోమవారం గౌరవరం వద్ద ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సరళాదేవి, డాక్టర్ మురళీకృష్ణ డ్రైవర్లు కంటి చూపు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టోల్‌గేట్ ప్లాజా మేనేజర్ గణేష్, ఆపరేషన్ మేనేజర్ ఆనంద్‌సింగ్, పీఆర్వో నరసింహారావు, సేఫ్టీ మేనేజర్ చక్రవర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జలదంకి: మండలంలోని గోపనపాళెం పంచాయతీలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవెల్లి మాలకొండారెడ్డి సోమవారం తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తెలుగు సినిమా పుట్టినరోజు వేడుక నేడు

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏపీఎఫ్‌సీసీ) నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకను మంగళవారం నిర్వహిస్తున్నట్లు కో- ఆర్డినేటర్ కళాంజలి అనంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్యా నగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్క్‌లో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


వింజమూరు తహసీల్దార్ కృష్ణారెడ్డి


సంగం: తహసీల్దారు రమాదేవి


ఉదయగిరి తహసీల్దార్ నెహ్రూబాబు


అనంతసాగరం తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు తహసీల్దార్‌గా ఎం.వెంకటకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా పెద్దఆరవీడు తహసీల్దార్‌గా పనిచేస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా, సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంగం తహసీల్దార్‌గా రమాదేవి

సంగం: సంగం నూతన తహసీల్దార్‌గా బీ రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా నుంచి సంగం తహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఇప్ప టి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న నాగరాజు బాపట్లకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రవీణ్ కుమార్, రీసర్వే డీటీ అశోక్‌కుమార్, ఆర్‌ఐ రాజా నారాయణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

చేజర్ల తహసీల్దార్‌గా గోపీకృష్ణ

చేజర్ల: చేజర్ల తహసీల్దార్‌గా కే గోపీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల కలెక్టరేట్‌లో ఏఓగా పని చేస్తూ సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఉదయగిరి తహసీల్దార్‌గా నెహ్రూబాబు

ఉదయగిరి: ఉదయగిరి తహసీల్దార్‌గా కె.నెహ్రూబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో బాపట్ల జిల్లా నిజాంపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తున్న నెహ్రూబాబును ఇక్కడ నియమించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

సోమశిల: అనంతసాగరం తహసీల్దార్‌గా పీ నరసింహారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చీరాల ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన అనంతసాగరం మండలానికి బదిలీ అయ్యారు.

రోడ్డు భద్రతపై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజరు కల్పన

ఆత్మకూరురూరల్: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆత్మకూరు ఎంవీఐ రాములు, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజరు కల్పన సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టీసీ డిపో కార్మికులతో పాటు ఆత్మకూరు-సోమశిల రహదారిపై వాహనదారులకు డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పలు వాహనాలను తనిఖీ చేసి వారికి సూచనలు చేశారు. కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు, సిబ్బందితో పాటు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసులు

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సోమవారం ఏపీఓ బి.శ్రీనివాసరావు పరిశీలించారు. మస్టర్లు తనిఖీ చేసి కూలీల హాజరు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తూ ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు కూలీ నగదు పొందాలన్నారు. ఏప్రిల్ నెల నుంచి కూలీలకు ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇకపై ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు సంబంధించిన పనులు చేసుకోవచ్చన్నారు.

పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం


పట్టణంలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. పట్టణంలోని 5వ వార్డులో పలు వీధుల్లో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కొంత శివారు ప్రాంతం 5వ వార్డులో ఉండడంతో మురుగు నీరు సజావుగా పోయేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ జేఈ ప్రసాద్, ఆర్‌ఐ ఖాసీం, కౌన్సిలర్లు ఎస్‌కే మహబూబ్‌బాషా, మొలబంటి రాజశేఖర్, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పార్టీ నాయకులు షేక్ రహీం, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం


అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ, తదితరులు

చేజర్ల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులుగా కలెక్టర్ హరినారాయణన్ నుంచి ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న అధికారులను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ షేక్ కరిముల్లా, డిప్యూటీ తహసీల్దార్ పి విజయ్‌లను శాలువాలతో సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు సేవలందిస్తూ విశిష్ట పురస్కారాలు అందుకున్న అధికారులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. మిగతా అధికారులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వరరెడ్డి, నోటి సుందరరామిరెడ్డి, ఏపీఓ వెంకటేశ్వర్లు, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదిలో తప్పిన ప్రమాదం


పెచ్చులూడిపడిన శ్లాబు


వరండాలో విద్యార్థులను చదివిస్తున్న దృశ్యం

సంగం: మండలం పడమటిపాళెం పంచాయతీ పల్లిపాళెం ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో సోమవారం ప్రమాదం తప్పింది. పాఠశాలలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. సోమవారం విద్యార్థులు పాఠశాలకు రాక ముందే భవనంలోని ఒక మూల శ్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో విద్యార్థులకు వరండాలో క్లాసులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఎంఈఓ జానకీరాంను సంప్రదించగా పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో నాడు-నేడు కింద 3వ విడతలో పాఠశాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామన్నారు.

నిధులు మంజూరు కాగానే పాఠశాల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. రోజు కూడా తరగతి గదిలో విద్యార్థులను సురక్షిత ప్రాంతంలోనే ఉంచి చదివిస్తున్నామన్నారు. పగుళ్లు కనిపించిన చోట ఎవరినీ కూర్చోనీయడం లేదని స్పష్టం చేశారు.